సాక్షి
కామారెడ్డి
శనివారం । 7 । జూన్ । 2025



యోగా భాగమవ్వాలి
శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత కోసం యోగాసాధన చేయాలని అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు.

- 11లో ▸



బడి బాట షురూ
జిల్లాలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల 19 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

- 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
38.0 /23.6

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తాం



కామారెడ్డి టౌన్ : అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) చైర్మన్ ఎరుకల నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం చేపట్టారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సబ్‌స్టేషన్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో వేదిక ఫైనాన్స్ మెంబర్లు శ్రీకాంత్, రాజగౌడ్, విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్, డీఈ కళ్యాణ్ చక్రవర్తి, ఏడీఈ కిరణ్ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

బక్రీద్ ఏర్పాట్ల పరిశీలన



కామారెడ్డి టౌన్ : బక్రీద్ సందర్భంగా జిల్లా కేంద్రంలో బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈద్గాల వద్ద పరిసరాలను శుభ్రం చేసి, రంగులు వేసి, విద్యుత్ దీపాలు, టెంట్లు వేశారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. బక్రీద్ సందర్భంగా ఆర్డీవో కార్యాలయం ముందు, పెద్దమ్మ కాలనీలో, పెద్ద బజార్, పాతబస్టాండ్, అశోక్‌నగర్‌కాలనీ, ఇస్లాంపురా ప్రార్థన మందిరాలలో ప్రత్యేక ప్రార్థన చేయనున్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ శనివారం ఆర్డీవో కార్యాలయం ముందు జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొననున్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు.

ఎన్‌కౌంటర్లు నిలిపేయాలి



కామారెడ్డి టౌన్ : కగార్ పేరుతో మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేసి చంపడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి దశరథ్, సహాయ కార్యదర్శి బాలరాజు, నాయకులు రాజమణి, శంకర్, దేవయ్య, ఈశ్వర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వీపీవో.. మరింత యాక్టివ్!



రుద్రారంలో సివిల్ రైట్స్ డేలో పాల్గొన్న విలేజ్ పోలీస్ ఆఫీసర్ (ఫైల్)

- గ్రామ పోలీస్ అధికారి వ్యవస్థను బలోపేతం చేస్తున్న ఎస్పీ
- ఏ సంఘటన జరిగినా తెలిసేలా నెట్‌వర్క్
- విలేజ్ హిస్టరీ షీట్‌లో అన్ని వివరాలు నమోదు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : నేరాలు జరగకుండా ముందస్తు సమాచారం తెలుసుకోవడం, నేరం జరిగితే సంఘటన ఎలా జరిగింది, ఎవరు బాధ్యులు అన్న విషయం తెలుసుకునేందుకు పోలీసు శాఖ విలేజ్ పోలీస్ ఆఫీసర్లను నియమించింది. పోలీస్ స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుళ్లకు ఒక్కొక్కరికీ ఒక్కో గ్రామాన్ని కేటాయించింది. పుష్కర కాలానికిపైగా ఈ వ్యవస్థ కొనసాగుతోంది. అయితే జిల్లా ఎస్పీగా రాజేశ్ చంద్ర బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ పోలీస్ అధికారి(వీపీవో) వ్యవస్థపై దృష్టి సారించారు. వీపీవోలు మరింత క్రియాశీలకంగా పనిచేసేలా చూస్తున్నారు. ఆయన ఏ పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో పరిస్థితుల గురించి తెలుసుకుంటున్నారు. వీపీవో వద్ద కచ్చితంగా తనకు కేటాయించిన గ్రామానికి సంబంధించిన పూర్తి సమాచారం ఉండాల్సిందేనంటున్నారు. గ్రామాల్లో ఏ సంఘటన జరిగినా క్షణాల్లో తెలిసేలా సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. తమకు కేటాయించిన గ్రామాలకు రెగ్యులర్‌గా వెళ్లి అక్కడి పరిస్థితులను తెలుసుకోవాలని, దాన్ని అధికారులకు తెలియజేయాలని పేర్కొంటున్నారు.

గ్రామ వాట్సాప్ గ్రూప్‌లలో...

సామాజిక మాధ్యమాల వినియోగం పెరిగిపోయింది. ముఖ్యంగా వాట్సాప్ వినియోగం ఎక్కువగా ఉంటోంది. గ్రామాలు, పార్టీలు, కులాల వారీగా వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా గ్రూపులలో జరిగే చాటింగ్‌ల గురించి తెలుసుకోవాలంటే గ్రామ పోలీసు అధికారి ఆ గ్రూపులో యాడ్ అవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీపీవోలు తమ గ్రామ పరిధిలోని వాట్సాప్ గ్రూపులలో మెంబర్లు చేరారు. దీంతో ఆయా గ్రూపులలో జరిగే రాజకీయ సంభాషణలు పోలీసులకు తెలిసిపోతున్నాయి. గ్రామాల్లో ఆధిపత్య పోరులో భాగంగా జరిగే అన్ని విషయాలు తెలుసుకోగలుగుతున్నారు. అలాగే గ్రామంలో అన్ని వర్గాల వారితో స్నేహ సంబంధాలు నెరపడం ద్వారా అన్ని విషయాలు తెలుసుకునే అవకాశాలు ఉంటాయి. ఇలా చేయడం వల్ల ఏ సంఘటన జరిగినా వెంటనే గ్రామ పోలీసు అధికారికి తెలుస్తుంది. అందుకే అందరితో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

ఠాణాలో విలేజ్ హిస్టరీ షీట్

తన గ్రామానికి సంబంధించి పూర్తి సమాచారం సేకరించిన గ్రామ పోలీసు అధికారి.. దాన్ని పోలీసు స్టేషన్‌లో ఉన్న విలేజ్ హిస్టరీ షీట్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. గ్రామాల్లో ఆధిపత్య పోరు, రాజకీయ విభేదాలు, కుల, మత సంబంధ వివాదాలు, ఏ వర్గాల మధ్య గొడవలు ఉన్నాయన్న విషయాలను తప్పనిసరిగా విలేజ్ హిస్టరీ షీట్‌లో పొందుపరచాలని ఎస్పీ సూచిస్తున్నారు. తద్వారా గొడవలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఇలా హిస్టరీ షీట్ నిర్వహించడం వల్ల పండుగల సమయంలో జరిగే వివాదాలు, రాజకీయ గొడవల విషయంలో చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రతి పోలీసు స్టేషన్‌లో విలేజ్ హిస్టరీ షీట్ రెగ్యులర్‌గా అప్‌డేట్ చేస్తున్నారు.

నాణ్యతతో మాకు సంబంధం లేదు

- బిల్లుపై ముద్రించిన విత్తన దుకాణదారు
- ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారులు



బీబీపేటలో విత్తనాల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

బీబీపేట : ''విత్తనాల నాణ్యత మేము నియంత్రించలేని విషయం. ఎలాంటి కష్టనష్టాలకు బాధ్యులం కాము'' అంటూ బీబీపేటకు చెందిన ఓ విత్తన దుకాణం నిర్వాహకుడు బిల్లుపై ముద్రించాడు. శుక్రవారం తనిఖీలకు వెళ్లిన బృందం దీనిని చూసి ఆశ్చర్యపోయింది. సదరు దుకాణం నిర్వాహకుడిపై ఏడీఏ అపర్ణ, ఎస్సై ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అమ్మే విత్తనాలకు దుకాణదారులే బాధ్యులని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఏడీఏ అపర్ణ హెచ్చరించారు.

మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. చాలావరకు విత్తనాలను తీసుకువచ్చిన కంపెనీల నుంచి బిల్లులు లేకపోవడం, రైతులకు ఎలాంటి రసీదులు ఇవ్వకపోవడాన్ని గుర్తించారు. బిల్లులు ఇవ్వకుండానే విత్తనాలు, మందులను రైతులకు విక్రయిస్తుండడంపై ఏడీఏ అపర్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లులు, రిజిస్టర్లు సరిగ్గా చూపించని దుకాణాలకు నోటీసులు ఇచ్చారు. దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సూచించారు.

పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం



భిక్కనూరులో ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రం అందిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

భిక్కనూరు : గూడు లేని నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. శుక్రవారం భిక్కనూరులోని గిద్ద హరిజనవాడ, కుమ్మరిగల్లి, పాత హరిజన వాడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. గత ప్రభుత్వం నిరుపేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించినప్పటికీ లబ్ధిదారులకు కేటాయించకపోవడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రాణహిత చేవెళ్ల పథకం ద్వారా మండలానికి సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, నాయకులు సుదర్శన్, దయాకర్‌రెడ్డి, రేఖ, లింబాద్రి, శ్రీరామ్ వెంకటేష్, సుధాకర్‌రెడ్డి నరేందర్‌రెడ్డి, భూమయ్య, నరసింహారెడ్డి, మోహన్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశానికి రెండు ప్రాణాలు బలి

- కొడుకుతో కలిసి చెరువులో దూకిన తల్లి
- ఇద్దరి మృతితో నర్సన్నపల్లిలో విషాదం



స్రవంతి మృతదేహం



రుద్రేశ్వర్ మృతదేహం

కామారెడ్డి క్రైం: క్షణికావేశంలో ఓ తల్లి తీసుకున్న నిర్ణయం కుటుంబంలో విషాదాన్ని నింపింది. కుమారుడితో సహా తల్లి చెరువులో దూకడంతో ఇద్దరి ప్రాణాలు నీట మునిగాయి. నర్సన్నపల్లి గ్రామంలో చోటు చేసుకున్న విషాద ఘటన వివరాలిలా ఉన్నాయి. నర్సన్నపల్లి గ్రామానికి చెందిన రాచమొల్ల ప్రశాంత్‌కు భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన స్రవంతి(25)తో వివాహమైంది. వీరికి శ్రీవల్లి అనే కూతురు, రుద్రేశ్వర్(4) అనే కుమారుడు ఉన్నారు. కొన్నాళ్ల క్రితం స్రవంతి అత్తగారికి చెందిన బంగారాన్ని తల్లి గారి కుటుంబ సభ్యులకు ఇచ్చింది. వారు ఆ బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం తీసుకున్నారు. నగలను తిరిగి ఇవ్వకపోవడంతో ఇటీవల ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరిగినట్లు తెలిసింది. శుక్రవారం నగల విషయమై స్రవంతితో కుటుంబ సభ్యులు గొడవ పడ్డట్లు సమాచారం. కొద్దిసేపటి తర్వాత స్రవంతి తన ఇద్దరు పిల్లలను వెంట తీసుకుని ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. పక్కనే ఉన్న చిన్నమల్లారెడ్డి చెరువు కట్టకు వద్దకు చేరుకున్నారు. నీటిలో దూకడానికి కూతురు నిరాకరించడంతో స్రవంతి కుమారుడు రుద్రేశ్వర్‌తో కలిసి నీటిలో దూకి మరణించింది. దీనిని గమనించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఇద్దరి మృతదేహాలను బయటికి తీయించారు. కుటుంబంలో జరిగిన గొడవల కారణంగానే స్రవంతి తన కొడుకుతో కలిసి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె తల్లి రాధమణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని రూరల్ సీఐ రామన్ తెలిపారు.

క్రమశిక్షణతో పనిచేయాలి

- ఎస్పీ రాజేశ్ చంద్ర
- 79 మంది హోంగార్డులు బదిలీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం : క్రమశిక్షణతో పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. జిల్లాలో దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్న 79 మంది హోంగార్డులకు స్థానచలనం కల్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాజేశ్ చంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం కౌన్సెలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మూడేళ్లకంటే ఎక్కువ కాలం ఒకే పోలీస్ స్టేషన్‌లో గానీ, పోలీసు కార్యాలయాల్లో గానీ విధులు నిర్వహిస్తున్న హోంగార్డులను బదిలీ చేశామన్నారు. హోంగార్డుల సీనియారిటీ, ఆరోగ్య పరిస్థితులు, కోరుకునే పీఎస్‌లులాంటి విషయాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా బదిలీలు నిర్వహించామన్నారు. ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్నా, స్వయంగా ఆఫీసులో వచ్చి తనను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. పోలీస్ ఉద్యోగంలో క్రమశిక్షణకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఒక్కరి తప్పు మొత్తం శాఖపై ప్రభావం చూపుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. హోంగార్డులు తమకు కేటాయించిన విభాగాల్లో నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యాకూబ్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ తిరుపయ్య, ఆర్ఐలు నవీన్ కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మరో కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

- విధులకు డుమ్మా.. ఆపై డ్రంకెన్ డ్రైవ్
- చర్యలు తీసుకున్న ఎస్పీ

కామారెడ్డి క్రైం: మూడు రోజుల వ్యవధిలో నిజాంసాగర్ ఠాణాలో పని చేస్తున్న మరో కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడమే కాకుండా అతిగా మద్యం సేవించి పోలీసులకు పట్టుబడిన వ్యవహారంలో ఓ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ రాజేశ్ చంద్ర శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్.రాకేష్ గౌడ్ అనే కానిస్టేబుల్ ఈనెల 5న అనుమతి లేకుండా విధులకు డుమ్మా కొట్టాడు. అతిగా మద్యం సేవించి కారు నడిపిస్తూ కామారెడ్డి వైపు వస్తుండగా.. తాడ్వాయి మండలం ఎర్రాపహడ్ సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. తాడ్వాయి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కానిస్టేబుల్ రాకేష్ గౌడ్ మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో ఎస్పీ రాజేశ్ చంద్ర అతడిపై సస్పెన్షన్ వేటు వేశారు. క్రమశిక్షణ తప్పితే ఉపేక్షించేది లేదని ఎస్పీ పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం కారణంగా రెండు రోజుల క్రితం ఇదే పీఎస్‌కు చెందిన కానిస్టేబుల్ మోహన్ సింగ్ సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే.

బడి బస్సులు పదిలమేనా?

- జిల్లాలో 253 స్కూల్ బస్సులు
- 120 బస్సులకే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి
- 12 తర్వాత స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామంటున్న రవాణా శాఖ అధికారులు



ఎల్లారెడ్డి: వేసవి సెలవులు ముగింపునకు వస్తున్నాయి. మరో వారం రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల రవాణాకు ఉపయోగించే బస్సులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించి, రవాణాశాఖ నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందే ప్రక్రియలో బిజీగా ఉన్నాయి. జిల్లాలో అన్ని ప్రైవేట్ పాఠశాలలకు కలిపి 253 వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలను ఏటా ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. అయితే ఇప్పటివరకు 120 బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన పాఠశాలలు సైతం తమ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు.

తమ పిల్లలను స్కూల్ బస్సులలో పంపించే తల్లిదండ్రులు కూడా ఆయా బస్సులకు సంబంధించిన ఫిట్‌నెస్ పత్రాలను, డ్రైవర్ పరిస్థితిని గమనించడం మంచిదని పేర్కొంటున్నారు. ఫిట్‌నెస్ లేకపోయినా, వేరే వ్యక్తులు బస్సు నడుపుతున్నా వెంటనే రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

ఫిట్‌నెస్ నిబంధనలు..

- పాఠశాల వాహనాలు తప్పనిసరిగా పూర్తి కండిషన్‌లో ఉండాలి.
- 15 ఏళ్ల జీవితకాలం పూర్తయిన వాహనాలను విద్యార్థుల రవాణాకు వినియోగించరాదు.
- పాఠశాల వాహనాలకు ముందువైపు ఎడమ పక్కన పాఠశాల వివరాలు అందరికీ కనిపించేలా రాయించాలి. విద్యాసంస్థ పేరు, యాజమాన్య ప్రతినిధుల సెల్ నంబర్, పాఠశాల పూర్తి చిరునామా ఈ వివరాల్లో స్పష్టంగా ఉండాలి.
- వాహనాల డ్రైవర్ల ఆరోగ్య వివరాలను యాజమానం తమ వద్ద కలిగి ఉండాలి.
- డ్రైవర్ బీపీ, షుగర్, కంటి చూపు సామర్థ్యానికి సంబంధించిన వివరాలు క్వాలిఫైడ్ డాక్టర్లతో ప్రతి మూడు నెలలకోమారు చెక్ చేయించాలి.
- పాఠశాల వాహనాల డ్రైవర్లకు కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి.
- వాహనాలకు తప్పనిసరిగా అత్యవసర ద్వారం ఉండాలి. దానిపై అత్యవసర ద్వారం అని స్పష్టంగా రాసి ఉండాలి.
- వాహనానికి సంబంధించి విండ్ స్క్రీన్, వైపర్స్, లైటింగ్, పార్కింగ్ లైట్లు సమర్థవంతంగా పనిచేసేలా చూసుకోవాలి.
- వాహనాల టైర్లు మంచి సామర్థ్యం కలిగినవి ఉండాలి.
- వాహనంలో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉండాలి.
- ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కూడా ఉండాలి.
- వాహనం ఫుట్‌బోర్డు మొదటి మెట్టు భూమి నుంచి 325 మిల్లీమీటర్ల ఎత్తు మించకుండా ఉండాలి. మెట్లు జారకుండా ఏర్పాటు చేయించాలి
- ప్రతి బస్సుకు ఒక అటెండర్ తప్పనిసరి.
- బస్సులో ప్రయాణించేవారి వివరాలు కూడా అందుబాటులో ఉండాలి.
- వాహనంలో స్కూల్ బ్యాగులు పెట్టుకునేందుకు షెల్ఫ్‌లు ఏర్పాటు చేయాలి.
- కిటికీలకు మధ్యలో ఇనుప కడ్డీలు తప్పనిసరిగా ఏర్పాటు చేయించాలి.

ఫిట్‌నెస్ లేకపోతే సీజ్ చేస్తాం

పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేయించుకోవాలని పాఠశాలలకు నోటీసులు ఇచ్చాం. జిల్లాలో 253 స్కూల్ బస్సులు ఉండగా ఇప్పటివరకు 120 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. మిగతా వాటికి కూడా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. ఈనెల 12 నుంచి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తాం. ఫిట్‌నెస్‌లేని బస్సులు కనిపిస్తే సీజ్ చేస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి

భూ సమస్యలను పరిష్కరిస్తాం



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిజాంసాగర్ : భూభారతి చట్టం ద్వారా భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. శుక్రవారం మాగిలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును ఆయన సందర్శించారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. మాగి గ్రామంలో అటవీ ప్రాంతంలో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్ పటేల్, తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం



దోమకొండ: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం దోమకొండ మండలంలోని అంచనూరు గ్రామంలో నూతనంగా ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా ఆమె ప్రారంభించి మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన గ్రామానికి చెందిన దాత మనోహర్‌ను ఆమె సన్మానించారు. గ్రామ యువత ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటులో ముందుండాలని సూచించారు. పోలీసులకు సహకరిస్తూ గ్రామ అభివృద్ధికి తోడ్పటు అందించాలని కోరారు. దొంగతనాలు జరుగకుండా ఉండాలంటే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొవాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భిక్కనూరు సీఐ సంపత్ కుమార్, ఎస్ఐ స్రవంతి, గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

9న దోస్త్ ప్రత్యేక కేటగిరీ ధ్రువపత్రాల పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు ఈ నెల 9న ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు దోస్త్ కోఆర్డినేటర్ వాసం చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక కేటగిరీ పీహెచ్‌సీ (దివ్యాంగులు), సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా కర్క్యులర్ అక్టివిటీస్ విద్యార్థులు అన్ని సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్‌లతో తెయూ అడ్మిషన్స్ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తారని తెలిపారు.

బడి బాట షురూ

- మొదటి రోజు 269 మంది విద్యార్థుల గుర్తింపు
- ఈనెల 19 వరకు కొనసాగనున్న కార్యక్రమాలు



జిల్లాకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో కరపత్రాలతో ఉపాధ్యాయులు

కామారెడ్డి టౌన్ : సర్కారు బడుల బలోపేతం కోసం, విద్యార్థుల సంఖ్య పెంపుకోసం ప్రభుత్వం ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. మొదటిరోజు జిల్లాలో 269 మంది విద్యార్థులను గుర్తించారు. కాగా మే 16వ తేదీ నుంచి ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించి మొత్తం 3,699 విద్యార్థులను బడిలో చేర్పించారు. ప్రస్తుత బడిబాటను 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. తొలిరోజు ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులతో గ్రామ సభలు నిర్వహించాల్సి ఉండగా.. కొన్నిచోట్ల మాత్రమే సమావేశాలు జరిగాయి. చాలా చోట్ల మొక్కుబడిగా కార్యక్రమం ప్రారంభమైంది.

పకడ్బందీగా నిర్వహిస్తాం



జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తాం. బడీడు, బడిబయట పిల్లలను గుర్తించి సర్కారు బడిలో చేర్పించేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారు. నాణ్యమైన విద్య అందుతోంది. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలి.

– రాజు, డీఈవో, కామారెడ్డి

బడిబాటలో చేపట్టే కార్యక్రమాలు..

- 7న ఉపాధ్యాయులు ఇంటింటికి సందర్శించి బడీడు పిల్లలను గుర్తించాలి.
- 8 నుంచి 10 వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించాలి. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించడం, డ్రాప్ అవుట్‌లను గుర్తించి బడిలో చేర్పించాలి. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను అందుబాటులో ఉన్న భవిత రిసోర్స్ సెంటర్‌లలో చేర్పించాలి.
- 11న జూన్ 6 నుంచి 10 వరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్షించాలి.
- 12న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టే పనులను ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలి. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాంలు అందించాలి.
- 13న సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించి బాలసభ కార్యక్రమం చేపట్టాలి. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలను ఆహ్వానించాలి.
- 16న విద్యార్థులకు గణితం, చదవడం, రాయడం వంటి అంశాలపై పోటీలు నిర్వహించాలి. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించాలి.
- 17న బాలికా దినోత్సవం నిర్వహించాలి. బాల్య వివాహాలు, చిన్నారులపై వేధింపులు, బాలిక అభివృద్ధికి సంబంధించి ప్రతిజ్ఞ చేయించాలి.
- 18న పాఠశాలకు గ్రామస్తులు, తల్లిదండ్రులను ఆహ్వానించి తరగతి గదులు, డిజిటలైజేషన్, అధునిక సౌకర్యాలను చూపించాలి. మొక్కల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయాలి.
- 19న బడిబాట ముగింపు కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించాలి.

రూ.20తో రెండు లక్షల ప్రమాద బీమా

మీకు తెలుసా?



ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) కింద ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లించవచ్చు. బ్యాంకు ఖాతా కలిగిన 18–70 ఏళ్ల లోపు వయస్సుగల వారు అర్హులు. ఈబీమా ద్వారా ప్రమాదం వలన మరణం సంభవించినా, లేదా ప్రమాద కారణంగా రెండు కళ్లు, రెండు చేతులు, లేదా ఒక కంటి చూపు, చెయ్యి లేదా పాదం కోల్పోయిన రూ. రెండు లక్షల బీమా నామినీకి సొమ్ము చెల్లిస్తారు.

- ఒక కన్ను లేదా ఒక చెయ్యి, లేదా ఒక కాలు వీటిలో ఏదేని ఒకటి కోల్పోయిన రూ.లక్ష చెల్లిస్తారు.
- ప్రమాదం జరిగినట్టుగా పోలీసు ఎఫ్ఐఆర్, డాక్టర్ ధ్రువీకరణతో సులభంగానే సంబంధిత బ్యాంకు ద్వారా క్లెయిమ్ చేసి బీమా సొమ్ము పొందవచ్చు.

– కామారెడ్డి అర్బన్

నూతన రేషన్‌కార్డు దరఖాస్తు కోసం ఇబ్బందులు

రామారెడ్డి: నూతన రేషన్ కార్డు దరఖాస్తు కోసం లబ్ధిదారుల ఇబ్బందులు పడుతున్నారు. రామారెడ్డి గ్రామానికి చెందిన ల్యాగల సంతోష్ తన తల్లి ల్యాగల లక్ష్మి, తండ్రి సాయి రెడ్డి, ల్యాగల సంతోష్ పేరుపై ఉన్న రేషన్ కార్డు ఉంది. ల్యాగల సంతోష్‌కు పెళ్లి కావడంతో భార్య అర్చన కుమార్తె సాగ్వాకతో కలిపి కొత్త రేషన్ కార్డు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాడు. ముందే మెదక్ జిల్లా శివాయిపల్లిలో తన భార్య అర్చన పేరును వాళ్ల తల్లిదండ్రుల రేషన్ కార్డు నుంచి తొలగించారు. మెదక్ జిల్లా శివాయిపల్లిలోని తన మామగారి రేషన్ కార్డులో రామారెడ్డి గ్రామానికి చెందిన సంతోష్ భార్య పేరు, సంతోష్ కుమార్తె పేరు చేరింది.

దీంతో మెదక్ జిల్లా శివాయిపల్లి గ్రామంలో ఉంటున్న తన అత్తమామల రేషన్ కార్డులోని తన భార్య అర్చన, కుమార్తె సాగ్వాక పేరును మళ్లీ మెదక్‌కి వెళ్లి స్థానిక తహసీల్ ఆఫీస్‌లో తొలగించి వచ్చాడు. మళ్లీ కొత్తగా తన రేషన్ కార్డు కావాలని మీసేవలో శుక్రవారం దరఖాస్తు చేసుకున్నాడు. రేషన్ కార్డు జారీలో తప్పుల తడకగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని పెద్దదడ్గిలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి మైన్స్ ఏడీ నగేశ్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. ఇల్లు కట్టుకోవడానికి లబ్ధిదారులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో కృష్ణ, కార్యదర్శి లక్ష్మణ్ ఉన్నారు.

మద్నూర్(జుక్కల్): మండలంలోని మదన్‌హిప్పర్గా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు పటేల్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

బాన్సువాడ రూరల్: బోర్లం గ్రామంలో జంగం భూదేవ్వ లబ్ధిదారు ఇంటికి బాన్సువాడ ఎంపీడీవో ముజాహిద్, పంచాయతీరాజ్ ఏఈ హన్మంతు, కార్యదర్శి సాయికుమార్‌లతో ముగ్గుపోసి భూమిపూజ చేశారు. హన్మాజీపేట్ గ్రామంలోనూ పంచాయతీ కార్యదర్శి రాజేశ్, గ్రామ మాజీ సర్పంచ్ బోనాల సుభాష్‌తో కలిసి పలువురు లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు.



బిచ్కుందలో పరిశీలిస్తున్న అధికారులు

దంపతుల ఆత్మహత్య



మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి : నగరంలోని గాయత్రినగర్ ప్రాంతంలో దంపతుల ఆత్మహత్య శుక్రవారం కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. కోటగల్లికి చెందిన శ్రీనివాస్ (56), మమత (52)కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. శ్రీనివాస్ నగరంలోని ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తుండేవాడు. ఇటీవల కోటగల్లిలోని సొంతింటిని విక్రయించారు. కూతురికి పెళ్లి చేయడంతోపాటు ఇద్దరు కుమారులను గల్ఫ్ దేశానికి పంపించారు. ప్రస్తుతం గాయత్రినగర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వేర్వేరు గదుల్లో శ్రీనివాస్, మమత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్, ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని దంపతుల ఆత్మహత్యకు గల కారణాలను ఆరా తీశారు. కాగా, ఆర్థిక ఇబ్బందులతోనే భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని స్థానికుల ద్వారా తెలిసింది.

త్యాగాల పండుగ బక్రీద్

- నేడు ఘనంగా నిర్వహించనున్న ముస్లింలు
- ఈద్గాల వద్ద ఏర్పాట్లు పూర్తి

బిచ్కుంద(జుక్కల్): ముస్లింలు జరుపుకునే పండుగల్లో ప్రత్యేకమైనది బక్రీద్. ఈ పండుగను త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారు. నేడు (శనివారం) బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఈద్గా, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పండుగ కోసం ప్రత్యేక ఏర్పాట్లను అధికారులు, స్థానిక ముస్లిం కమిటీల ప్రతినిధులు ఇప్పటికే పూర్తిచేశారు. పండుగ సందర్భంగా ముస్లింలు ప్రార్థనల అనంతరం పొట్టేళ్లను ఖుర్బానీ ఇస్తారు. పొట్టేళ్ల మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి ఒక భాగం ఇంటి కోసం, రెండో భాగం బంధువులకు, మూడోది నిరుపేదలకు పంపిణీ చేస్తారు.

బీజేపీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



బీబీపేటలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు



తాడ్వాయిలో మాట్లాడుతున్న లింగారావు



బాన్సువాడలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు



కామారెడ్డిలో మాట్లాడుతున్న విపుల్ జైన్

బీబీపేట/ఎల్లారెడ్డిరూరల్/తాడ్వాయి/సదాశివనగర్/మాచారెడ్డి/రాజంపేట/లింగంపేట/కామారెడ్డి టౌన్/బాన్సువాడ రూరల్/భిక్కనూరు : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీజేపీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మారెడ్డి అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధాన మంత్రిగా బాధ్యతలు తీసుకొని 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం బీబీపేటలో సంకల్ప సహకార కార్యక్రమంలో భాగంగా మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలు వివరించడం ప్రతి బీజేపీ కార్యకర్త బాధ్యత అని పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డిలో బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షులు మహారాజుల మురళి మాట్లాడారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నిలకు సిద్ధం కావాలని తాడ్వాయిలో బీజేపీ ఎల్లారెడ్డి నియోజక వర్గం కన్వీనర్ లింగారావు అన్నారు.నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రవీందర్ రావు సూచించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా సదాశివనగర్ ఎల్లమ్మ ఆలయం వద్ద మొక్కలు నాటారు. పాల్వంచ, మాచారెడ్డి మండలాల్లో నిర్వహించిన సంకల్ప సహకార కార్యక్రమాల్లో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నంది వేణు మాట్లాడారు. రాజంపేటలో నిర్వహించిన సంకల్ప సహకార కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అనిత మాట్లాడారు. లింగంపేట మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైళ్ల కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు క్రాంతికుమార్ మొక్కలు నాటారు. కామారెడ్డి పట్టణంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో బీజేపీ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు విపుల్ జైన్ మాట్లాడారు. బాన్సువాడలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు కోనాల గంగారెడ్డి తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు.భిక్కనూరులో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంట లక్ష్మారెడ్డి మాట్లాడారు. ఈకార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం



కామారెడ్డి క్రైం: పట్టణంలోని భవానీ రోడ్‌లో నివాసం ఉండే బొడ్డి నూకరాజు (55) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. నూక రాజుకు ఇద్దరు భార్యలు ఉండగా, మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈనెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు ఇప్పటికీ తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంతవెతికినా అతడి ఆచూకీ లభించలేదు. రెండో భార్య జ్యోతి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సజ్జన్‌పల్లిలో వివాహిత..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన చిన్నప్పగారి రుక్కవ్వ అనే వివాహిత అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రుక్కవ్వ సోమవారం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లగా, ఇప్పటికీ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబసభ్యులు నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వెంకటాపూర్ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్ గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నిజ్జన పోచన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు సాయిబాబా శుక్రవారం తెలిపారు. గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ప్రధాన కార్యదర్శిగా పెంటయ్య, సహాయ కార్యదర్శిగా చిరంజీవులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మల్లేష్ ఉన్నారు.

నల్లమడుగు ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని శుక్రవారం మండల ఎమ్మార్పీఎస్ నెల్లూరి గంగారాం ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా మాల్తూమ్ సాయిలు, ఉపాధ్యక్షుడిగా మాల్తూమ్ నర్సింలు, ప్రధాన కార్యదర్శి గంగాధర్, కోశాధికారి గులాంగారి సంజీవులు, సలహాదారులు శేఖర్, సంజీవులు, భాస్కర్, సాయిలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు భూపతి, మాసాని సాయిలు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కానిస్టేబుల్ కుమారుడిపై మైనర్ డ్రైవింగ్ కేసు

ఖలీల్‌వాడి: నగరంలో ఓ కానిస్టేబుల్ కుమారుడు మైనర్ డ్రైవింగ్ చేయడంతో ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ కానిస్టేబుల్‌కు ప్రభుత్వం కేటాయించిన బైక్‌ను అతడి కొడుకు (మైనర్) నడిపించడంతో ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, బైకును సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ఇసుక వాహనం పట్టివేత

రుద్రూర్: కోటగిరి శివారు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టాటా వాహనాన్ని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వాహనాన్ని కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ షేక్ రఫిక్, వాహన యాజమాని షేక్ లతీఫ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సునీల్ తెలిపారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రంలో పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేసి, పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. అలాగే వారి నుంచి రూ. 10830 నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు, మూడు వాహనాలను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

బోధన్: ఎడపల్లికి చెందిన గట్టుపల్లి సాయి కుమార్ (27) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. సాయికుమార్‌కు సరైన ఉద్యోగం లభించక ఏడాదిగా ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో అతడి భార్య ఆద్రిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

పిట్లం(జుక్కల్): మండలంలోని రాంపూర్ గ్రామంలో గురువారం సాయంత్రం ఓ గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాలు.. గ్రామంలోని రైతు ముందడి బలరాంరెడ్డికి చెందిన గేదె రోజులాగే గ్రామ శివారులో మేత మేసేందుకు వెళ్లింది. మేత మేస్తుండగా కింద పడిన విద్యుత్ తీగలను గేదె తాకడంతో విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మరణించింది. రూ. 50వేల విలువ గల గేదె మృతి చెందడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.

70 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



కామారెడ్డి క్రైం: డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 70 క్వింటాళ్ల రేషన్ బియ్యంను కామారెడ్డి సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి 40 కిలోల చొప్పున రేషన్ బియ్యంను సంచులలో నింపి దాదాపు 180 బస్తాలను ఓ డీసీఎంలో తరలించేందుకు సిద్ధం చేశారు. వెంటనే సీసీఎస్ పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, సీసీఎస్ పోలీసులు కలిసి డీసీఎంను, డ్రైవర్ అర్బాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి వాటిని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగిస్తామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కీమ్యానాయక్ తండాలో ఘర్షణ

- పలువురికి గాయాలు
- 112టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించిన గుర్తుతెలియని వ్యక్తి
- ఇరువర్గాలపై కేసు నమోదు చేసిన పోలీసులు

బాన్సువాడ రూరల్: మండలంలోని కీమ్యానాయక్ తండాలో గురువారం అర్ధరాత్రి రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలువురికి గాయాలు కాగా, ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా.. కీమ్యానాయక్ తండాకు చెందిన గణేష్–సరిత దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా ఇటీవల గణేష్ తన భార్యను పుట్టింట్లో వదిలేసి వచ్చాడు. దీంతో భార్య తరపు బంధువులు కీమ్యానాయక్ తండాకు వచ్చి, గణేష్‌తోపాటు అతడి బంధువులపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పలువురికి స్వల్ప గాయాలు కాగా గణేష్ బావ ప్రేమ్‌సింగ్‌కు తీవ్రగాయాలయ్యాయి. గొడవపై ఓ గుర్తు తెలియని వ్యక్తి 112నెంబర్‌కు కాల్‌చేసి సమాచారం అందించారు. దీంతో తెలంగాణ అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థ (టీజీఈఆర్ఎస్ఎస్), తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీ) బంజారాహిల్స్ హైదరాబాద్ వారు సత్వరమే స్పందించి బాన్సువాడ పోలీసులకు, వైద్య సేవల కోసం అంబులెన్స్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడు ప్రేమ్‌సింగ్‌ను చికిత్స కోసం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఘటనపై శుక్రవారం అల్లుడు గణేష్, మామ మానిక్‌లు పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. అలాటే పౌరులు అత్యవరసర పరిస్థితుల్లో పోలీసుల సేవలను సంకోచించకుండా వినియోగించుకోవాలని కోరారు. 112కు కాల్ చేయడంతో ఒక ప్రాణాన్ని కాపాడినట్లు వివరించారు.

బాలానగర్‌లో వివాహిత ఆత్మహత్య

జక్రాన్‌పల్లి: మండలంలోని బాలానగర్‌లో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన గుంజ వెంకట్ తన కూతురు గుంజ అక్షయ (19)కు నెల క్రితం నిజామాబాద్ రూరల్ మండలంలోని నాగారం గ్రామానికి చెందిన పల్లపు సునీల్ అనే వ్యక్తితో వివాహం జరిపించాడు. కొన్ని రోజులుగా తనను భర్త శారీరకంగా వేధిస్తున్నాడంటూ అక్షయ రెండు రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. కాగా శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అక్షయ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు భర్త సునీల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాలిక్ తెలిపారు.

మాక్లూర్‌లో యువకుడు..

మాక్లూర్: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన రాచర్ల శ్రీకాంత్(29) కోత మిషన్‌పై డ్రైవర్‌గా పని చేస్తూ, జీవనం సాగించేవాడు. గురువారం రాత్రి తన పెళ్లి విషయమై తల్లిదండ్రులతో చర్చించాడు. ప్రస్తుతం వివాహం జరిపించడం కష్టమంటూ తల్లిదండ్రులు తేల్చిచెప్పడంతో అతడు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం స్థానిక చెరువులో అతడు శవమై తేలడంతో పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని వెలికి తీసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

బీబీపేట: ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా.. మండలంలోని ఇస్సానగర్ గ్రామానికి చెందిన సంగెపు స్వామి (45) అప్పుల బాధ భరించలేక ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి అతడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తల్లి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి

రెంజల్ (బోధన్): చేపల వేటకు వెళ్లిన జాలరి వలకు చిక్కుకొని ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని కూనేపల్లి గ్రామానికి చెందిన పాముల సాయిలు (50) అనే వ్యక్తి శుక్రవారం స్థానిక రేకుల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు ప్రమాదవశాత్తు వలకు చిక్కుకొని, నీటిలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నాన్‌బెయిలబుల్ వారెంట్ నిందితుడి పట్టివేత



బాలాజీ గైక్వాడ్

ఖలీల్‌వాడి: పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఓ వ్యక్తి పోలీసులకు చిక్కకుండ తిరుగుతుండగా, అతడిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ ఇష్యూ కాగా శుక్రవారం పట్టుకున్నట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దేగ్లూర్ తాలూకాలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన బబ్లు బాలాజీ గైక్వాడ్ అలియాస్ ధన్ల బాబు (47) కొన్ని సంవత్సరాలుగా కామారెడ్డి జిల్లాలో పలు నేరాలకు పాల్పడ్డాడు. ఇతడిపై 24 వారెంట్లు ఇష్యూ కాగా, పోలీసులు ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. నగరంలో అతడు సంచరిస్తున్నట్లు సీపీకి విశ్వసనీయ సమాచారం రావడంతో సీసీఎస్ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు సీసీఎస్ పోలీసులు నిందితుడిని పట్టుకుని కామారెడ్డి పోలీసులకు అప్పగించారు. సీసీఎస్ బృందాన్ని సీపీ సాయిచైతన్య అభినందించారు.

సైబర్ మోసం కేసులో ఒకరి అరెస్టు

ఖలీల్‌వాడి: ఇన్వెస్ట్‌మెంట్ పేరు మీద సైబర్ మోసానికి పాల్పడిన ఒకరిని అరెస్ట్ చేసినట్లు నిజామాబాద్ సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశ్వర్ రావు శుక్రవారం తెలిపారు. జిల్లాకు చెందిన శ్రావణ్ కుమార్‌ను ఇటీవల మహారాష్ట్రకు చెందిన పాండురంగ్ సుభాష్ మహాపంకర్ ఇన్వెస్ట్‌మెంట్ పేరు మీద రూ.31,36,900 వసూలు చేసి సైబర్ మోసానికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. సదరు మోసగాడిపై దేశవ్యాప్తంగా 38 కేసులు నమోదయ్యానని పోలీసులు తెలిపారు. అతడి ఆచూకీ గుర్తించి, సీసీపీఎస్ సీఐ ముఖీద్ పాషా, సిబ్బంది సురేష్, నాగభూషణం, ప్రవీణ్, నరేష్ ఈ నెల 1న మహారాష్ట్రకు వెళ్లగా, గురువారం అరెస్ట్ చేశారు. అక్కడి కోర్టులో హాజరు పరిచి, శుక్రవారం రిమాండ్ నిమిత్తం నిజామాబాద్‌కు తీసుకొచ్చి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు అతడికి 14 రోజుల రిమాండ్ విధించగా నిజామాబాద్ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అట్రాసిటీ కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్: అప్పుగా ఇచ్చిన డబ్బులను తిగిరి ఇవ్వమని అడిగిన వ్యక్తిని బెదిరించి, కులం పేరుతో దూషించడంతో ఇద్దరికి నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి శ్రీనివాస్ ఐదేళ్ల జైలు శిక్ష, విధించారు. వివరాలు ఇలా.. ఆర్మూర్ మండలం పెర్కిట్‌కు చెందిన మేకల సురేష్ నుంచి 2016లో పెద్దపల్లి జిల్లా జూలపల్లికి చెందిన గొంగ్లళ భవాని, చొప్పదండి మండలం రేపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్యలు రూ. 50లక్షలు అప్పుగా తీసుకుని ప్రామిసరి నోట్ రాసిచ్చారు. నెలలు గడుస్తున్నా వారు డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో 2018 జూలై 2న సురేష్ వారికి నోటీసులు పంపారు. దీంతో వెంకటయ్య, భవానీలు 2018 నవంబర్ 25న పెర్కిట్ బస్టాండ్ వద్ద సురేష్‌పై దాడి చేసి, కులం పేరుతో దూషించారు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు నిందితులను పట్టుకొని కోర్టులో హాజరుపర్చారు. విచారణ అనంతరం శుక్రవారం నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.4వేల జరిమానా విధిస్తు జడ్జి తీర్పు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.